

రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:35 శుక్రవారం

సహార్ | 4:50 శనివారం

ఘనంగా లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం

రాయికల్, మార్చి 28: రాయికల్ మండలం చెర్లకొండాపూర్ గ్రామంలో లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితులు దేవుని నారాయణ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వల



- ఇంటర్ ప్రవేశాలకు ఫోన్ కాల్స్
- ప్రైవేటు కళాశాల యాజమాన్యాల పోటీ
- రంగంలోకి పీఆర్‌వోలు
- 'పది' పరీక్షలు పూర్తికాకముందే తల్లిదండ్రులతో ఒప్పందాలు
- జోరుగా అడిష్మన్ల వ్యాపారం

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హలో సర్...మీ అమ్మాయి పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తుందని తెలుసుకున్నాము...మీ అమ్మాయి బాగా చదువుతుందని ముందు నుంచే విన్నాం.. మా కళాశాలలో నాణ్యమైన బోధన ఉంటుంది. మంచి మార్కులు వచ్చే విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇస్తాం...ఒకసారి మా కాలేజీకి వచ్చి చూడండి... కేవలం ముందస్తు అడ్మిషన్ ఫీజు చెల్లిస్తే చాలు... అంటూ ప్రైవేటు, కార్పొరేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ చేస్తూ అడ్మిషన్ల వల విసురుతున్నారు.



ఆఫర్లపై ఆఫర్లు...

జిల్లాల్లో ప్రైవేటు కళాశాలలు అడ్మిషన్ల కోసం ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. గత ఏడాది విద్యార్థులు సాధించిన మార్కులు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో విజయ అవకాశాలతో రంగురంగుల బ్రోచర్లను రూపొందించి విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక కళాశాలకు దీటుగా మరో కళాశాల విభిన్నంగా ఉండేలా ప్రచారం చేస్తున్నాయి. ఉన్నవి, లేనివి చూపిస్తూ అడ్మిషన్ల కోసం ప్రయత్నిస్తు న్నాయి. కళాశాలల్లో పీఆర్‌వోలను ఏర్పాటు చేసుకొని గ్రామాల వారీగా షెడ్యూల్‌తో అడ్మిషన్ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

అందుకు ఏమాత్రం తగ్గకుండా ప్రైవేటు కళాశాలలు తమ దగ్గర ఉన్న సౌకర్యాలు, లేని సౌకర్యాలు, తేక పేర్లను జోడించి తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. జిల్లాలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న అడ్మిషన్ల ప్రచారం అంతా ఇంతా కాదు.. పదో తరగతి విద్యార్థులను చేర్చుకునేందుకు ఇంటర్ కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు రంగంలోకి దిగాయి.

కళాశాలల పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ (పీఆర్‌ఓలు) అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నారు. ప్రవేశాలకు ముందస్తుగా తల్లిదండ్రులతో ఒప్పందాలు చేయించుకుంటున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాలతో పాటు పలు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని తలపించే విధంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అడ్మిషన్ల వ్యాపారం చేస్తున్నారు. పేరు మోసిన తమ కళాశాలల్లో సీట్లు దొరకవని త్వరపడాలని ప్రచారం చేస్తూ ఆందోళనకు గురిచేస్తున్నారు. ముందుగా అడ్మిషన్ బుక్ చేసుకుంటే ఫీజు రాయితీ ఉంటుందని మాయ మాటలతో నమ్మిస్తున్నారు. ముందుగానే సీటు రిజర్వ్ చేసుకోకపోతే కోరిన బ్రాంచ్‌లో సీటు దొరకదని బెదరకొడుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, విజయవాడ, గుంటూరు వంటి పట్టణాల్లో పేరు మోసిన కార్పొరేట్ కాలేజీల్లో ముందస్తు అడిష్మన్లు పొందుతున్నారు.

పరీక్షలు కాకముందే..

పదో తరగతి వార్షిక పరీక్షలు పూర్తి కాకముందే కళాశాలల్లో ప్రవేశాలకు ముందస్తు బుకింగ్‌లు జరుగుతున్నాయి. జిల్లాలో 11,366 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. ప్రైవేటుగా పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు 841 మంది ఉన్నారు. విద్యార్థుల అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు, కన్సల్టెన్సీలు, పీఆర్‌ఓలకు చేరాయి.

అయితే పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు సైతం పీఆర్‌వోలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గత యేడాది రెగ్యులరైజ్ అయినా పలువురు లెక్చరర్లు సైతం పీఆర్‌ఓలుగా వ్యవహరిస్తూ కమీషన్లు దండుకుంటున్నట్లు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. దీంతో పరీక్షలతో సంబంధంగా లేకుండా సీట్ల కోసం ముందస్తు బుకింగ్‌లు జరు పుతున్నారు. ముందస్తుగా బుక్ చేస్తే పీఆర్‌వోలకు కమీషన్లు లభిస్తుండడంతో పీఆర్‌వోలు తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నారు.

ఒక్కో విద్యార్థిపై రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు కమీషన్ అందుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఇంటర్ అడ్మిషన్లకు ఎల్ఐసీ ఏజంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, ఆర్ఎంపీలను సైతం రంగంలోకి దింపి ఒక్కో విద్యార్థితో యాజమాన్యం నిర్ణయించిన ఫీజు కట్టిస్తే పది శాతం డబ్బులు ముట్టజెప్పేందుకు పీఆర్‌ఓలతో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అయోమయంలో తల్లిదండ్రులు...

పది పరీక్షలు రాసి మంచి మార్కులు సాధిస్తారనుకొని అంచనాలున్న విద్యార్థుల తల్లిదండులు ప్రైవేటు కళాశాలల సిబ్బంది చేసే ఫోన్ కాల్స్‌తో విసుగు చెందుతున్నారు. ఒకవేళ ఫోన్ లిఫ్ట్ చేయకపోతే కార్లు వేసుకుని ఇళ్ల వద్ద వాలిపోతుండడంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. పేరుకే వేసవి సెలవులు అయినప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థలో అడ్మిషన్ల ప్రక్రియ అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది.

కళాశాలలో పని చేస్తున్న సిబ్బందికి టార్గెట్లు ఇచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీధుల్లో తిప్పుతున్నారు. తమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఏ ఊరి వారో చూసుకుని ఆ ఊరిలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పది పరీక్షలు రాసిన విద్యార్థుల అడ్రస్సు తీసుకుని వారి ఇళ్లకు వెళుతున్నారు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు ఏ సామాజిక వర్గానికి చెందిన వారు, ఎవరితో చెబితే మాట వింటారో ముందుగానే ఒక అవగాహన వచ్చి వారితో కలిసి అడ్మిషన్ల కోసం ఒత్తిళ్లు తెస్తున్నారు.

అప్రమత్తతే ప్రధానం..

తల్లిదండ్రులు తొందరపడి పిల్లల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఒక్కసారి కాలేజీలో చేరితే ఎవ్వరూ పట్టించుకోరని పేర్కొంటున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించే ముందు పిల్లల అభిప్రాయాలతో పాటు సదరు కళాశాలల్లో విద్యా బోధన, వసతులు, అనుమతుల గురించి తెలుసుకోవాలని హెచ్చరి స్తున్నారు. తమ విద్యా వ్యాపారం కోసం నిత్యం పుస్తకమే ప్రపంచంగా మార్చే కళాశాలలున్నాయని, అలాంటి కళాశాలల్లో చేర్పిస్తే విద్యార్థులు ఒత్తిడికి గురై మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయని సూచిస్తున్నారు. అందుకని తల్లిదండ్రులు ఆలోచించాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కార్పొరేట్ పెట్టుబడిదారులకు ధారాదత్తం

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020ను దేశంలో అమలు చేయడం కోసం మానవ వనరుల శాఖ రాష్ట్రాల అధికారాలను, ఫెడరల్ హక్కులను హరిస్తూ దేశవ్యాప్తంగా ప్రయి వేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు విద్యారంగాన్ని ధారాదత్తం చేస్తోందని విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. విద్యార్థుల మేధాశక్తి ద్వారా విచ్చల విడిగా వ్యాపారం చేస్తోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా జరపాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పకడ్బందీగా వరి ధాన్యం కొనుగోళ్లు జరపాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో 2023-24 యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన సలహాలు, సూచనలు ఆదేశాలు అందించారు. జిల్లాలో 1,18,824 హెక్టార్లలో వరిసాగు చేయడం జరిగిందని, ఇందుకు గాను 5,65,241 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలకు వస్తుందని అంచనా ఉందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హతీరాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్ రావు, జిల్లా బాయిల్డ్ మిల్లర్ల అసోసియేషన్, లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను అరికట్టేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత కోరారు. గంజాయి సరఫరాతో పాటు పిల్లలను మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా కాపాడాలని కోరుతూ జడ్పీ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వినతి పత్రం అందజేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ జిల్లా కేంద్రం కొన్ని రోజులుగా మాదక ద్రవ్యాలకు బిందువుగా మారిందనే వార్తలు రావడం బాధాకరమన్నారు. పోలీస్ శాఖ, ఎక్సైజ్, నార్కోటిక్, డ్రగ్ అధికారులు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంపీపీ లక్ష్మి, కౌన్సిలర్ శ్రీలత ఉన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్

జగిత్యాలరూరల్, మార్చి 28 : జగిత్యాల మండలం తిప్పన్నపేట లో హోలీ పండగ రోజున మేడిశెట్టి రమ అనే వివాహితను హత్య చేసిన అదే గ్రామానికి చెందిన నిందితుడు భోగు ప్రకాశ్ అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ ఆలీఖాన్ తెలిపారు. గురువారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో హత్యకు దారితీసిన వివరాలను సీఐ వెల్లడించారు. మృతురాలు రమ కూతురు వాణిని తనకు ఇచ్చి పెళ్లి చేయాలని ప్రకాశ్ అడగగా రమ నిరాకరించింది. దీంతో రమపై ప్రకాశ్ కోపం పెంచుకున్నాడు. ఎలాగైన రమతోపాటు కుమారుడు రిషిని చంపేసి వాణిని పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఈ నేపథ్యంలో హోలీ పండగరోజున పథకం ప్రకారం ప్రకాశ్ ఇంటి సమీపంలో రమతో పాటు రిషి పై దాడికి పాల్పడ్డాడు. దాడిలో మృతురాలు రమ మెడ కింది భాగంలో తీవ్రగాయమై రక్తస్రావమైంది. దీంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రమ మృతి చెందింది. గురువారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల శివారులో జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా తిరుగుతున్న భోగు ప్రకాశ్‌ను పట్టుకొని అతడి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన ద్విచక్రవాహనం, కొడవలి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆరీఫ్ ఆలీఖాన్ తెలిపారు. ఎస్సై సధాకర్, పీసీ లు రవినాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది డబ్బు లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కోర్టులో నిర్వహించిన ఎన్నికల్లో లక్ష్మారెడ్డి రెండు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు, విజయం సాధించిన లక్ష్మారెడ్డిని బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కాళేశ్వరం నీళ్లు రాక ఎండుతున్న పంటలు

పోతారంలో ఎండిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే



ఎండిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

సారంగాపూర్, మార్చి, 28 : గతంలో కాళేశ్వరంతో ఒక్క ఎకర పారలేదు అని చెప్పిన నాయకులకు నేడు కాళేశ్వరం నీళ్ల రాక ఎండుతున్న పంటలు కనిపించడం లేదా అంటూ ప్రభుత్వం పై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని పోతారం గ్రామంలో ఎండిన వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు గుండె కాయలాంటిదన్నారు. కాళేశ్వరం నీటితో పంటలు సమృద్ధిగా పండాయన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయం అందక పోగా పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది సీనియర్ నాయకులు ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టించి కాళేశ్వరం దండగ అని చెప్పి రైతులకు అరిగోస పెడుతున్నారని విమర్శించారు. వెంటనే కాళేశ్వరం పునరుద్ధరణ పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించేల చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూస్తుంటే మరల మునుపటి రోజులు గుర్తుకు వస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, మనోహ ర్‌రెడ్డి, డిల్లీ రామరావు, జోగినిపెల్లి సుధాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 15 స్థానాల్లో విజయం మాదే

- దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉంది
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 15 స్థానాల్లో విజయం సాధించబోతున్నామని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వివేక్, వంశీ కృష్ణలకు నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో నిర్వహించాల్సిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కేంలం తన స్వార్థ, ఆర్థిక ప్రయోజనాలను చేకూర్చుకునేందుగాను రూ. 38 వేల కోట్ల అంచనాతో మేడిగడ్డ వద్ద నిర్మాంచాల్సిన బ్యారేజీని లక్షా ఇరవై వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రాష్ట్రాన్ని అప్పుల మయంగా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ అవినీతిని కాపాడేలా బీజేపీ రక్షణ గొడుగులా తయారైందని ఆరోపించారు. నిరుద్యోగ యువతను ఆదుకునేలా ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పిన ప్రధాని మోదీ ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రానున్న ఎంపీ ఎన్నికల్లో దేశంలో భారత ప్రజాస్వామ్య పరిరక్షణ మనుగడ ప్రశ్నార్థకం కావద్దని ఇండియా కూటమి అధికారంలోకి రావల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉందని ప్రజలు, ఓటర్లు గత పాలన, బీజేపీ పాలనను చేసి బేరీజు వేసుకుని ఓట్లు వేయాలని కోరారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందనే విషయాన్ని ఓటర్లు ఆలోచించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని 100 రోజుల్లో చేసిన అభివృద్ధే ప్రజలు మాకు ఇవ్వబోయే తీర్పు అన్నారు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు, చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే తమ గెలుపునకు పునాదిగా మారబోతుందన్నారు. దేశానికి ముప్పు తెచ్చే దేశద్రో హుల పై ఫోన్ ట్యాపింగ్ చేయాలే తప్ప చట్ట విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్‌లు చేయడాన్ని పూర్తిగా తప్పుబట్టారు. అనంతరం పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్ బాగుపడాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. కాకా వెంకటస్వామి ఆశీస్సులతో పెద్దపల్లి పార్లమెంట్ ఓటర్ల ఆసీస్సులతో రానున్న ఎంపీ ఎన్నికల్లో 17 సీట్లు గెలిచి సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ లక్ష్మి, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు జగదీశ్వర్, గంగాధర్, మన్సూర్, శోభారాణి, అనిత ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో స్వల్పంగా పెరిగిన భక్తుల రద్దీ

- నేడు రథోత్సవం
- ఆలయం పక్షాన ఏర్పాట్లు

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి క్షేత్రంలో బహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో గురు వారం భక్తుల రద్దీ పెరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల కల్యాణం, తెప్పె, డోలోత్సవాలు తిలకించి ప్రత్యేక దర్శనం చేసుకుని తిరుగు ముఖం పట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 29న జరిగే ప్రధాన ఘట్టం అయిన స్వామి వారల రథోత్సవం తిలకించేకు ఒక రోజు ముందు నుంచియే భక్తుల రాక మొదలైంది. ఆలయాల్లో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య నిత్యపూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్య వేక్షణలో రినో వేషన్ కమిటీ సభ్యులు ఆర్య వైశ్య నిత్యాన్న సత్ర సంఘం కోశాధికారులు శంకరయ్య, దేవేందర్, సూ పరింటెండెంట్ కిరణ్ పలు అందించారు.



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

- 29న జరిగే లక్ష్మీ నృసింహ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ రామ లింగేశ్వర స్వామి రథోత్సవాల కోసం ఆలయం పక్షాన తగు ఏర్పాట్లు చేస్తున్నారు. రథాలను అందంగా పూలతో అలంకరణ చేయించి మరునాడు స్వామి వారలను ఆశీనులు చేసి ఉత్సవాలను నిర్వహించేందుకు అధి కారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారలను దర్శించుకునేందుకు వీలుగా ఇసుక స్థంభం వరకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు.
- బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 29 న శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 3 గంటలకు రథోత్సవం ఉంటుంది. రాత్రి 7 గంటలకు చక్రతీర్థం, 9 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారల పుష్ప యాగం ఉంటుందని ఈవో శ్రీనివాస్ తెలిపారు.
- బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఆలయానికి రూ 1,47,846 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. వీ టిలో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 68,098, ప్రసాదాల విక్రయం ద్వారా రూ 65,525 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ 14,223 విరాళాలు సమర్పించినట్లు ఆయన వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో అలరించిన దోపుకథ

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శేషప్ప కళావేదిపై గురువారం రాత్రి ఆలయ అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్‌చే నిర్వహించబడిన దోపుకథ భక్తులను అలరించింది. స్వామి వారల ఉత్సవమూర్తులను సేవలపై ఆశీనులు చేసి పుర వీధుల గుండా ఊరేగించిన అనంతరం శేషప్ప కళా వేదికపై తీసుక వచ్చారు. వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రాల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు పూజలు నిర్వహించారు. చక్రపాణి కిరణ్‌కుమార్ బ్రహ్మోత్సవాల మహత్యం గురించి దోపు కథ ద్వారా వివరించారు. స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి గుండి ప్రేమ్‌కుమార్, పురుషోత్తం నిర్వహించిన మిమిక్రీ భక్తులను ఆకట్టుకుంది. జగిత్యాలకు చెందిన శార్వాణి సంగీతం, కుమారి లాస్య, శ్రీకృతి కూచిపూడి నృత్య ప్రదర్శన, ఆనంద్‌వర్ధన్ ఏకపాత్రాభినయనం అలరించింది. కళాకారులను ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ రవీందర్ సన్మానించారు.





పచ్చునూర్‌లో కేంద్ర బలగాల కవాతు

మానకొండూర్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని పచ్చునూర్ గ్రామంలో గురువారం స్థానిక సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.





హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వివరాలు వెల్లడించిన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో పులి పద్మ అనే మహిళను హత్య చేసిన కేసులో నిందితుడు పులి గంగయ్య గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన నిందితుడి అరెస్ట్ వివరాలు ఆయన వెల్లడించారు. పులి పద్మకు ఆమె ఇంటి పక్కనే ఉన్న పులి గంగయ్యకు కొంత కాలం నుంచి భూమి సరిహద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో కాటమయ్య పండుగ జరుగగా నిందితుడు గంగయ్య హాజరయ్యాడని ఆయన తెలిపారు. ఆ సమయంలో గంగయ్య భార్య పులి రేణుక ఇంటిలో ఎవరు లేని సమయంలో వంట గదిలో చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితుడు గంగయ్య ఇంటికి వచ్చి చూసే సరికి భార్య చనిపోయి ఉండటం వల్ల పులి పద్మనే కారణమని భావించి ఉలి తీసుకుని ఆమెను ఇంట్లో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేసినట్లు ఆయన అన్నారు. పద్మ భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నిందితుడు గంగయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 28: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,500 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 46మంది రైతులు 609క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,500, కనిష్ఠ ధర 4వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాల్లో కొనుగోళ్లు ఉండవని, తిరిగి సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని అధికారులు తెలిపారు.

పీఆర్ ఏఈకి షోకాజ్ నోటీసులు జారీ


ఇల్లందకుంట, మార్చి 28: ఇల్లందకుంట మండల పంచాయతీరాజ్ ఏఈ రాంబాబుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి షోకాజ్ నోటీసులు గురువారం జారీ చేశారు. ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బోగంపాడు, ఇల్లందకుంట, వంతడుపుల గ్రామాలకు రూ. 30లక్షలు అంతర్గత రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. కాగా పనులు చేపట్టడంలో ఏఈ రాంబాబుకు నిర్లక్ష్యం గా వ్యవహరించడంతో జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఈజీఎస్ పనులు మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 28: మానకొండూర్‌లో గురువారం విద్యుత్ స్తంభం పై నుంచి పడి జూనియర్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్ బాలక్రిష్ణ 33కేవి లైన్ బ్రేక్‌డౌన్ మరమ్మతు పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. సబ్‌స్టేషన్‌లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నప్పటికీ జూనియర్ లైన్‌మన్‌తో పనులు చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నలువల స్వామి డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, మార్చి 28: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వినియోగం లోకి ఓ పెట్రోల్ బంక్ ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాళీ స్థలములో కొబ్బరి చెట్ల కింద గుర్తు తెలియని మగ వ్యక్తి శవం ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతడు 15 రోజులుగా గ్రామంలో మానసిక స్థితి బాగాలేక రోడ్డు వెంబడి తిరిగినట్లు స్థానికులు తెలిపారు. ఎండ వేడిమికి వడదెబ్బ కారణంగానే అతడు మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని ఎస్సై చేరాలు తెలిపారు.













రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 28 : పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పుట్ట మల్లయ్య(51) ద్విచక్ర వాహనం ఢీకొని చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం పనులు ముగించుకొని ఇంటికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో అందుగులపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు పుల్లూరి గట్టయ్య ఢీకొట్టాడు. దీంతో మల్లయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు పుట్ట సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో అస్వస్థతకు గురై ప్రయాణికుడి మృతి

మెట్‌పల్లి, మార్చి, 28 : మెట్‌పల్లి పట్టణ శివారులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న భోగం సామయ్య(70) అనే వృద్ధుడు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన భోగం సామయ్య కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. పనుల నిమిత్తం తన సొంత గ్రామానికి వెళ్లి తిరిగి గురువారం తన చెల్లెలితో కలిసి హుజూరాబాద్ డీపోకు చెందిన బస్సులో నిజామాబాద్‌కు బయలు దేరారు. మెట్‌పల్లి పట్టణ అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట చేరుకోగానే సామయ్య ఊపిరాడక పడిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో సామయ్యను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులు బస్సులో ఎక్కడంతో ఊపిరాడక గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం


రైతును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు

రాయికల్, మార్చి 28: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో గురువారం విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి భీమరాజ్‌ను ఉత్తమ రైతుగా ఘనంగా సన్మానం చేశారు. రైతులు వారు పండించిన పంటలపై వారికి ఉన్న సమస్యల పరిష్కారం, పెట్టుబడి తగ్గించి ఎక్కువ లాభాలను ఏ విధంగా సమకూర్చుకోవచ్చునని శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, అల్లీపూర్ దత్తత గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ డీఏ రజనీ దేవి, ఆర్థిక శాస్త్రవేత్త, పొలాస శాస్త్రవేత్తల బృందం, అల్లీపూర్ ఎఫ్ఈవో అధ్యక్షుడు అత్తినేని శంకర్, రైతులు ఓరుగంటి రాజలింగం, ఓరుగంటి రాజు, ఎల్లేశ్వరం శేఖర్, గొల్లపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన


హుజూరాబాద్‌రూరల్, మార్చి 28: మండలంలోని ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ సిబ్బంది ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కంపెనీ సీఈవో సిద్ధాంత్ లోహియా రైతులు వేసవి కాలంలో మొక్కలకు సరిపడా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ భారత్, రైతు గూడురు స్వామిరెడ్డి, కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వేణు, కాటిపల్లి సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రామచంద్రం, పల్లె వీరయ్య, మల్లు, గాజా తిరుపతి, సామల కోటిరెడ్డి, గూడూరి చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మల్లాపూర్, మార్చి, 28: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లోనే ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ధనుంజయ్, సురేష్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అను ముగ్గురు మండలంలోని కొత్తధాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసు స్టేషన్‌లో చేసుకున్న మందు పార్టీ వెలుగులోకి వచ్చింది. ప్రజలకు బాధ్యతగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది తమ విధులను మరిచి రాజకీయ నాయకులతో కలిసి విందు చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులకు తెలయడంతో ధనుంజయ్, సురేష్‌లను సస్పెండ్ చేయగా హెడ్ కానిస్టేబుల్ అశోక్‌పై శాఖా పరమైన చర్యల నిమిత్తం మల్టీ జోన్-1 ఐజీకి నివేదిక పంపించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

టేకు దుంగల పట్టివేత

మల్లాపూర్, మార్చి, 28 : మండలంలోని గొర్రెపల్లి గ్రామ శివారులోని అక్రమంగా నిలువ చేసిన టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు డీవైఆర్‌వో చంద్రమౌళి, ఎఫ్‌బీవో సత్తార్‌లు పట్టుకున్నట్లు గురువారం తెలిపారు. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామ శివారులోని రూంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా టేకు దుంగలను నిలవ చేసిన పక్క సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామన్నారు. అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను స్వాధీనం చేసుకొని దొంగల కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుకొన్న టేకు దుంగల విలువ సుమారు రూ. 1,50 వేలే ఉంటుందని అంచనా వేశారు. పట్టుకున్న దుంగలను రేంజ్ టింబర్ డిపోకు తరలించినట్లు తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


నిండుగా ప్రవహిస్తున్న కెనాలు

నిండుగా కాకతీయ కాలువ

- నీళ్ల లేక వరదకాలువ వెలవెల

మల్యాల, మార్చి 28: ఎస్సారెస్పీ వరదకాలువలో నీరు లేక బోసిపోతుంటే.. నిండుగా ప్రవాహంతో ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ జలకళ సంతరించుకుంది. చివరి దశలో ఉన్న వరి పంటలకు చివరి తడి అందించేందుకు ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కెనాల్‌కు అధికారులు నీళ్ల వదలగా వరదకాలువలో నీరు లేక కాలువ కింద సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మల్యాల మండలంలో ఎస్సారెస్పీ వరదకాలువ, కాకతీయ కెనాల్ ఉన్నాయి. ఒక్క దానిలో నీరు, మరొక దానిలో నీరు లేకపోవడంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నీరు లేక బోసిపోతున్న వరదకాలువ

కమనీయం శివపార్వతుల కల్యాణం


స్వామివారల ఉత్సవమూర్తులు

- జనసంద్రమైన వేములవాడ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వేములవాడ, మార్చి 28: ఆది దంపతులు పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కల్యాణం వేములవాడ పుణ్యక్షేత్రంలో గురువారం కన్నుల పండువగా సాగింది. దక్షిణ కాశీగా, భూలోక కైలాసంగా హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ముందుగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణ క్రతువును ప్రారంభించారు. తొలుత ధ్వజారోహణం అనంతరం వరుడు రాజరాజేశ్వరస్వామివారు, వధువు పార్వతీదేవి అమ్మవార్లను వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాలతో ఎదుర్కొన్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆలయం తరుపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, మున్సిపాలిటీ తరుపున కమిషనర్ అన్వేష్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం స్వామి వారల ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున ఉదయం 10-50 గంటలకు వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య మాంగళ్యధారణ గావిం చారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్-ఇందిర దంపతులు కన్యాదాత లుగా వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆలయ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● కల్యాణం వీక్షించేందుకు..

పార్వతీరాజరాజేశ్వరస్వామివారల కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, శివపార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకొని తన్మయత్వం చెందారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది శివపార్వతులు, భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి మురిసిపోయారు. కల్యాణం జరుగుతున్నంత సేపు చేతిలో త్రిశూలాలను కదిలిస్తూ శివనామ స్మరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, మేన్‌రోడ్డు ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్ర్కీన్లపై భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక డీఎస్పీ కే.నాగేంద్రచారి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు శివపురాణం, ప్రధాన హోమం, సప్తపది, లాజాహోమము, ఔపాసనము, బలిహరణము నిర్వహించారు. అనంతరం పెద్దసేవపై స్వామివారలను ఊరేగించారు.


స్వామివారి ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న భక్తులు


మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు


పట్టువస్త్రాలు అందజేస్తున్న ఆలయ ఈవో, మున్సిపల్ కమిషనర్

రాయికల్‌లో గంజాయి పట్టివేత

● మైనర్‌తో పాటు ముగ్గురు నిందితుల అరెస్టు ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్, మార్చి 28: గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ అడ్డాల వద్ద విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న మైనర్‌తో సహా మరో ఇరువురు వ్యక్తులను గురువారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాల పట్టణానికి చెందిన పాత నేరస్థులైన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్, ఓ బాలుడు జగిత్యాల నుంచి రాయికల్‌కు గంజాయిని సరఫరా చేస్తూ రాయికల్ మండలం కుమ్మరిపెల్లి స్టేజీ వద్ద పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి 1.5 కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఇటీవల గంజాయి కేసులో రిమాండ్ అయిన పెనుగొండ గణేష్, మాలావత్ సతీష్‌తో జగిత్యాల పట్టణానికి చెందిన కొండూరి రాజేష్, ఆరుముల్ల సాయి కుమార్‌తో పాటు మరో బాలుడు ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. వీరు సీసీఎల్ దగ్గరికి వెళ్లి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి జగిత్యాల జిల్లాకు అక్రమంగా తీసుకువచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ గ్రూప్ సభ్యుల్లో కొందరు మైనర్లకు గంజాయిని అలవాటు చేశారని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 25న గంజాయి తక్కువ ధరకు విక్రయించి గురువారం రాయికల్‌కు అక్రమంగా తీసుకువస్తుండగా తమ వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని విచారించామన్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. పట్టుబడిన ఇరువురు నిందితులపై జగిత్యాల, వరంగల్ జిల్లాల్లోని మూడు స్టేషన్‌ల పరిధిలో పాత కేసులు ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదు..

నా కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని ఆరుముల్ల సాయి కుమార్ తల్లిదండ్రులు గంగాధర్, రజిత అన్నారు. గతంలో సాయి కుమార్ తప్పు చేసినప్పుడు పలు కేసులు నమోదయ్యాయని, ఆరు మాసాలుగా ఇంటి వద్దే ఉండి పని చేసుకుంటున్నాడని అన్నారు. తన కుమారుడు ఎటువంటి తప్పు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎస్పీ మాట్లాడుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అందుకే అరెస్టు చేశామని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

పెగడపల్లి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని పెగడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయపల్లికి చెందిన ఇడుగునూరి వంశీకృష్ణ , మరో బాలుడు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా స్థానిక నంది చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకుని వస్తుండగా నంది చౌరస్తా వద్ద పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో 900 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు డీఎస్పీ రఘుచందర్ వివరించారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్.ఐ జాడి రామకృష్ణ, ఏఎస్ఐ సత్తయ్య, పోలీస్ సిబ్బంది రవీందర్, వెంకట్ రెడ్డి, తిరుపతి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

హత్యకేసులో నిందితుడికి జైలు

మంథని, మార్చి 28: హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి గురువారం తీర్పునిచ్చారు. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన గుండ్ల సదయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన దూపం శ్రీనివాస్ ఇంట్లోకి 11మే 2023న అక్రమంగా చొరబడి గొడ్డలితో దాడి చేశాడు. దీంతో బాధితుడు శ్రీనివాస్ భార్య దూపం స్వప్న మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడు సదయ్యను రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ పూర్తి అనంతరం మంథని కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి భారతి నిందితుడు గుండ్ల సదయ్య దాడి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానాను విధించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 28: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష, మరొకరికి ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 15 మందిని గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఐదుగురికి జైలు శిక్ష, మొత్తం 9,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 10 మందికి 19,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సంవత్సరములో 102 మందికి జైలు శిక్ష పడిందని సీఐ పేర్కొన్నారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ చేయడానికి ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేస్తామన్నారు.

నర్సింగాపూర్‌లో చోరీ


పరిశీలిస్తున్న పోలీసులు

చందుర్తి, మార్చి 28: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఒకరి ఇంట్లో గుర్తులేని వ్యక్తులు చొరబడి వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బైరగోని మల్లేశం అనే వ్యక్తి వేములవాడలోని ఉంటాడు. నర్సింగాపూర్ గ్రామంలో ఉండే ఇంట్లో భద్రపరిచిన 10 తులాల వెండి పట్టగొలుసులను తీసుకెళ్లేందుకు గ్రామానికి గురువారం రాగ ఇంటి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగ 10 తులాల పట్టా గొలుసులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కారు, బైకు ఢీ.. వృద్ధురాలు మృతి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 28: కారు, బైకు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని మిర్జంపేటలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన తిప్పారపు ఓదమ్మ(75) తన మనవడు విగ్నేష్‌తో కలిసి మండలంలోని మిర్జంపేటలో దశదిన కార్యక్రమానికి వచ్చి గురువారం ద్విచక్ర వాహనంపై తిరిగి గుంపులకు వెళుతుండగా గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఓదెమ్మ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. తిప్పారపు మహేష్ తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న విగ్నేష్‌ను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి

తిమ్మాపూర్, మార్చి28: అర్హులైనా అభ్యర్థులు సీయూఈటీ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ టెస్టింగ్ ద్వారా నిర్వహించే కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ(యూజీ)- 2024)ను కేంద్ర విద్యా శాఖ, యూజీసీ తప్పనిసరి చేసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ టి లలితకుమారి తెలిపారు. ఈ పరీక్ష కేంద్ర విద్యా శాఖ పరిధిలో ఉండే కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర విశ్వ విద్యాలయాలు, సంస్థలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలో, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష అని తెలిపారు. ఈసీయూఈటీ పరీక్ష దేశంలోని అన్ని కేంద్ర విశ్వ విద్యాలయాలు, ఇతర ప్రైవేటు విశ్వ విద్యాలయాలలో ప్రవేశం పొందడానికి అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 200 విశ్వవిద్యలయాలు, 46 కేంద్ర విశ్వ విద్యాలయాలు, 30 రాష్ట్ర విశ్వ విద్యాలయాలు, 9 డీమ్డ్(స్వయం ప్రతి పత్తి), 113 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, 6 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని తెలిపారు. ఈసీయూఈటీ(యూజీ)-2004 వెబ్ సైట్‌లో ఫిబ్రవరి-2024న ప్రారంభించినట్లు చెప్పారు. మార్చి 31లో గడువు ముగియనుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https//exams.nta.ac.in/CUET-UGలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధర్మపురిలో ఘనంగా వేంకటేశ్వరుడి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారల ఉత్సవమూర్తిని సేవపై ఆశీనులు చేశారు. అనంతరం సేవను దక్షిణ దిశలో గల పోలీస్‌స్టేషన్, ఉత్తర దిశలో గల ఉసిరిక వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామి వారల కళ్యాణం, తెప్పె, డోలోత్సవం అనంతరం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రల కోసం బయలు దేరడం ఏటా జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికల వద్ద సనాతన సాంప్రదాయ రీతిలో వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్య, యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, తదితరులు రాత్రి వరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి దంపతులు, ఎస్ఐ ఉదయ్‌కుమార్ దంపతులు, బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ కుటుంబ సభ్యులు వేదికల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఉత్సవ కమిటీ సభ్యులు రాపర్తి సాయి కిరణ్, మాదాసు మల్లేష్, స్తంభంకాడి గణేష్, కొమురెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు



శ్రీనివాస్‌రావు

కోరుట్ల, మార్చి 28 : సివిల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తన్నీరు శ్రీనివాస్‌రావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు మచ్చ రమణమూర్తి, చెన్న విశ్వనాథం, సహాయ ఎన్నికల అధికారులు వోటరికారి శ్రీనివాస్, సంగ విజయ్ సాయిలు గురువారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా తోట అంజనేయుడు, ప్రధాన కార్యదర్శిగా సుతారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మద్దుల రోజ, కోశాధికారిగా చిలువేరి రాజశేఖర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ నంబర్‌లుగా కస్తూరి రమేష్, కొంపెల్లి సురేష్, మహిళ రిప్రిజెంటీస్‌గా చాప వందన, జూనియర్ ఎగ్జిక్యూటివ్స్ లోకిని శ్రావణ్య దీపా, సయ్యద్ అనాసొద్దిన్, పూరడి నరేంధర్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు సన్మానించి అభినందించారు. వచ్చే నెల 1 నుంచి బాధ్యతలను స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

సంకష్టహర చతుర్థి పూజలు



ధర్మపురిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, మధు రామశర్మ, కాసర్ల వంశీకృష్ణ తదితరులు వేద మంత్రాల మధ్య గణపతికి దేవుడికి గణపతి ఉపనిషత్తులతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్ పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని వినాయక దేవాలయాలలో గురువారం సంకటహార చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించి వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా దేవాలయాలలో గణపతి హవనం కార్యక్రమం నిర్వహించి అర్చన అభిషేక కార్యక్రమాలను వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్, కపిల్ శర్మ, ప్రసీందశర్మ, సునీల్ శర్మలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి



దాసరి సునిత - రాజశేఖర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జువ్వాడి నర్సింగ రావు

కోరుట్ల, మార్చి 28 : కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ దాసరి సునిత - రాజశేఖర్‌లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో తన అనుచరులతో చేరగా కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచిన ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ బోయినిపల్లి సత్యంరావు, మున్సిపల్ మాజీ చైర్మెన్ శీలం వేణుగోపాల్, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, నాయకులు ఎంబేరి సత్యానారాయన, మ్యాకల నర్సయ్య, అడెపు మధు, స్రోగ్రబీ, నేమూరి భూమయ్య, రంజిత్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటు వేయాలి

మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు



ఇబ్రహీంపట్నంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం, మార్చి 28: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో ప్రధాన వీధుల గుండా కవాత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్ స్టేషన్ వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని అన్నారు. యువత మత్తుకు బానిస కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సిఐ నవీన్, ఎస్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లింబాద్రి

మెట్‌పల్లి, మార్చి, 28 : మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఐదోసారి పుప్పాల లింబాద్రి ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు మగ్గిడి వెంకటనర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, పసునూరి శ్రీనివాస్, నల్ల రాజేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడుగా పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శిగా తునికి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడుగా ఎల్మల రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా రాంపల్లి జగన్, కోశాధికారిగా రాజేష్‌శెట్టి, క్రీడల, సంస్కృతిక కార్యదర్శులుగా మగ్గిడి హరిభూషన్, మగ్గిడి నర్సయ్య, లైబ్రరీ కార్యదర్శిగా కోట రాజారెడ్డి, లేడి రిప్రెజెంటివ్‌గా కాజీపేట స్రవంతి, కార్యవర్గ సభ్యులుగా ఒజ్జెల శ్రీనివాస్, అలాల సత్యనారాయణ, సురభి అశోక్, జూనియర్ కార్యవర్గ సభ్యులుగా మన్నె గంగాధర్, వాల్గోట్ మహేష్, కొమిరెడ్డి శేషగిరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహణాధికారులు తెలిపారు.



నూతన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

నిర్మాణ పనులకు మోక్షమెప్పుడో..?

● బీఆర్ఎస్ హయాంలో గురుకుల భవన నిర్మాణానికి శంకుస్థాపన

● మగ్గిడిలో అరకొర వసతులతో విద్యార్థుల ఇక్కట్లు

గొల్లపల్లి, మార్చి 28 : అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది గొల్లపల్లి తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయం స్వంత భవనం నిర్మాణం. దశాబ్ద కాలంగా స్వంత భవనం నిర్మాణానికి నోచుకోక అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. స్వంత భవనం నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నాబార్డు ద్వారా రూ. 17 కోట్ల నిధులను మంజూరు చేసినప్పటికీ ఇప్పటి వరకు పనుల ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత సంవత్సరం అక్టోబరులో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ భవన నిర్మాణ పనులకు అట్టహాసంగా ప్రారంభించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం స్వంత భవనం నిర్మాణం పనులు కేవలం శిలాఫలకానికే పరిమితం కాగా, పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. గొల్లపల్లి మండల కేంద్రంలో గత 2022 వరకు నిర్వహించిన విద్యాలయాన్ని అద్దె భవనం కొరతతో ధర్మపురి మండలంలోని మగ్గిడికి తరలించి విద్యాలయాల కార్యకలాపాలను నిర్వహిస్తు న్నారు. మండల కేంద్రంలో ఉండాల్సిన విద్యాలయాన్ని మరో మండలానికి తరలించడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసహనం చెందుతున్నారు. ఇదిలా ఉండగా గురుకుల విద్యాలయానికి దశాబ్ద కాలం కిందటే స్థానిక రామాలయం వెనకాల ఉన్న ప్రభుత్వ భూమిలో స్థలాన్ని కేటాయించారు. అయితే, ఇక్కడే ఒక స్థానిక బీఆర్ఎస్ నాయకుడు లౌక్యం ప్రదర్శించి గతంలో కేటాయించిన స్థలాన్ని కాదని, తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, తన స్వంత పట్టా భూమికి డిమాండ్ రావాలనే ఉద్దేశంతో గొల్లపల్లి రెవెన్యూ శివారులోని ఓ గుట్టబోరుకు స్థలాన్ని కేటాయించేలా అధికారుల పై ఒత్తిడి తెచ్చి సఫలీకృతుడయ్యాడు. దీంతో రెవెన్యూ అధికారులు గతంలో కేటాయించిన స్థలాన్ని పక్కకు పెట్టి గ్రామ రెవెన్యూ శివారులోని జోన్నల రాశి బోరుకు సర్వే నెంబరు 759 అనే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ఆ మేరకు అక్కడ అగమేఘాల మీద అప్పటి మంత్రితో భూమి పూజ చేయించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా గ్రామ నడిబొడ్డులో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉండే స్థలాన్ని తోసిరాజని మారుమూల ప్రదేశంలో గుట్టబోరును కేటాయిం చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.





స్వంత భవనం నిర్మాణానికి కేటాయించిన స్థలం..ఏర్పాటు చేసిన శిలాఫలకం

రెండేళ్ల క్రితం మగ్గిడికి తరలింపు :

గురుకుల విద్యాలయాన్ని 2022 విద్యా సంవత్సరం వరకు గొల్లపల్లి మండల కేంద్రంలోని ఓ అద్దె భవనంలో నిర్వహించేవారు. అయితే, 2022 సంవత్సరం ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా అద్దె భవనం ప్రమాద భరితంగా మారింది. అద్దె భవనం ముందు భాగం వర్షం ధాటికి కూలిపోవడం, పాఠశాల ఆవరణలో మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అప్పట్లో పరిశీలించిన అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు విద్యాలయాన్ని ధర్మపురి మండలం మగ్గిడికి తరలించి పాఠశాలను అక్కడే నిర్వహిస్తున్నారు. స్వంత భవనం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికి, దానికితోడు స్వంత భవనం నిర్మాణానికి కోట్ల నిధులు మూలుగు తున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా తయారైంది. తాత్కాలికంగా విద్యాలయాన్ని తరలించి సంబంధిత అధికారులు, అప్పటి మంత్రి చేతులు దులుపుకున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఇప్పటికైన కొత్త ప్రభుత్వ హయాంలోనైనా స్వంత మండలానికి తరలించి కనీసం వచ్చే విద్యా సంవత్స రంలోనైనా స్వంత భవనం నిర్మించాలని కోరుతున్నారు.

గతంలో కేటాయించిన స్థలంలోనే నిర్మించాలి

గురిజల బుచ్చిరెడ్డి, స్థానికుడు, గొల్లపల్లి



గురుకుల విద్యాలయాన్ని మారుమూల ప్రదేశంలో గుట్టబోరుకు నిర్మించడం సరైంది కాదు. గతంలో ఊరి నడి బొడ్డున కేటాయించిన స్థలంలోనే స్వంత భవనం నిర్మాణం చేపట్టాలి. ఊరికి దూరంగా గుట్టబోర్ల మధ్య స్వంత భవనం నిర్మిస్తే విద్యార్థులు తీవ్ర భయాందోళన చెందే అవకాశం ఉంది.

పైగా, గుట్టబోరు కావడంతో అక్కడ క్రూర జంతువులు సైతం సంచరిస్తాయి. దీని వల్ల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. రాజ కీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసమే ఇక్కడి నుంచి అక్కడికి తరలించే కుట్రలు పన్నుతున్నారని, వాటిని మేం అడ్డుకుంటాం.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని టౌన్ హాలు సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ హెల్త్, ఏఈ, డీఈ, మిషన్ భగీరథ ఈఈ తదితర శాఖల అధికారులతో తాగునీటి సరాఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ గురించి దిశా నిర్దేశం చేశారు. ఎండాకాలం ఎలాంటి తాగునీటి సమస్య ఏర్పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాటర్ టెస్టింగ్‌లకు సంబంధించిన క్లోరోస్కోపులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, డీపీవో దేవరాజ్, జడ్పీ సీఈవో రఘువరన్, డీఆర్‌డీవో సంపత్ రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జీవన్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, మార్చి 28 : ఎమ్మెల్సీ, నిజామాబాదు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డిని గురువారం కోరుట్ల కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంట్లో అయన కలిసి సన్మానించి అభినందించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో జీవన్‌రెడ్డి బారీ మెజార్టీతో గెలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు కొంతం రాజం, సత్యానారాయణ గౌడ్, సమయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

జగిత్యాలరూరల్, మార్చి 28 : జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ప్రజ్ఞ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు కాలువ అనన్య, పూసరి మహిత్ ఇస్రో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన యువిక యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబరిచారు. క్విజ్, సైన్స్ ప్రాజెక్ట్ సహ పాఠ్యపోటీలలో తమ విశిష్ట ప్రతిభను కనబరిచి ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా 350 మంది విద్యార్థులలో రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలో నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా ఇందులో ప్రజ్ఞ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం జిలాకు గర్వకారణమని కరస్పాడెంట్ జనగామ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అనిల్, అకాడమీ ఇన్‌చార్జి రాజశేఖర్, ఉపాధ్యాయులు సంధ్య, సాగర్ విద్యార్థులను అభినందించారు.

ముగిసిన వ్యవసాయ పరిశోధనా సమావేశాలు

జగిత్యాలరూరల్, మార్చి 28 : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయపరిశోధన స్థానంలో నిర్వహించిన వ్యవసాయ పరిశోధనల సమావేశాలు గురువారం ముగిశాయి. రెండోరోజు సమావేశాల్లో భాగంగా వివిధ జిల్లాలో ఉన్న పంటల సరళి, కొత్త పంటల సరళిని డాక్టర్ లీలారాణి ప్రజెంట్ రూపంలో రైతులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం వివిధ పంటల ప్రధా నశాస్త్రవేత్తలతో కమిటీలను ఏర్పాటుచేసి కమిటీల్లో రైతులకు స్థానం కల్పించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ రైతులు కొత్తపద్ధతులు, యూనివర్సిటీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకొని వ్యవసాయం చేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను గడించవచ్చునన్నారు. శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ అధికారులు, అనుబంధల శాఖల అధికా రులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయంగా సహకార సంఘాలు

చైర్మన్ ఏనుగు ముత్యం రెడ్డి



దహన సంస్కారాల నిమిత్తం డబ్బులు అందజేస్తున్న చైర్మన్

రాయికల్, మార్చి 28: రైతుల శ్రేయస్సు ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని సహకార సంఘం చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి అన్నారు. భూపతిపూర్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. 2023-24 వార్షిక నివేదికను ఆదాయం, ఖర్చులను సంఘ కార్యదర్శి చంద్రశేఖర్ చదివి వినిపించారు. ఈ వార్షిక సంవత్సరంలో రూ.88 లక్షల విలువైన ఫర్టిలైజర్‌ను అమ్మడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగుల మల్లయ్య గౌడ్, డైరెక్టర్లు కోసరి మహేష్, నేతల లక్ష్మీనారా యణ, నిమ్మల భారతి శేఖర్‌రెడ్డి, పాల్ప రమణ, కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది రాజేష్, రంజిత్, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

● రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా 2023-24 సం వత్సరంలో జమ, ఖర్చుల వివరాలను సమర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికిగాను 10 శాతం డివిడెండ్ సభ్యుల ఖాతా జమ చేశామన్నారు. అలాగే ముగ్గురు సంఘ సభ్యులు మరణించినందున దహన సంస్కారాల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.30 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మార్కండేయ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్‌లు కుర్మ రాము, కొల్ల నారాయణ, పాలడుగు నరసింహారెడ్డి, గుండ నరేష్, జేతి లక్ష్మి, మండల వసంత, బోడ భూమరాజం, సీఈవో ఎలిగేటి రవి కుమార్, అసిస్టెంట్ సీఈవో జగదీష్ పాల్గొన్నారు.

యాసంగి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

జగిత్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం సేకరణకు అన్ని ఎర్పాట్లు పూర్తి చేసినట్లు డీఎస్‌వో వేంకటేశ్వరరావు తెలిపారు. గురువారం రబీ 2023-24 యాసంగికి సంబంధించిన వరి ధాన్యం కోనుగోలు కేంద్రాల ఎర్పాట్లపై అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం కోనుగోలు చేయడానికి 416 కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాట్లు తెలిపారు. ఇందులో పీఎసీఎస్ 282, ఐకేపీ 133, మెప్మా 1 కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వరి ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2203, సాధారణ రకానికి 2183 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. జిల్లాలో 5.65 లక్షల మెట్రిక్ టన్నుల వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిల ఆటలు కట్టించేందుకే 'షీ' టీం

గొల్లపల్లి, మార్చి 28 : మహిళలు, యువతులు, విద్యార్థినిల పటిష్ట భద్రత కోసం, వారిని వేధించే ఆకతాయిల ఆటలు కట్టించేందుకే పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'షీ' టీం వ్యవస్థ ప్రత్యేకంగా పని చేస్తుందని ఏఎస్సై మహ్మద్ బేగ్ పేర్కోన్నారు. గురువారం గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థినిలకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వ హించారు. ఏఎస్సై మాట్లాడుతూ మహిళల భద్రతే లక్ష్యంగా షీ టీం పని చేస్తుందని, ఎవరైన ఆకతాయిలు వేధిస్తే షీ టీం సభ్యులకు సమాచారమందిస్తే క్షణాల్లో సంఘటనా స్థలికి చేరుకుని పోకిరిల ఆట కట్టిస్తామని తెలిపారు. షీ టీంకు ఫిర్యాదు చేస్తే నేరంగా భావించకూడదని, అవసరమైతే బాధితుల పేర్ల నుగోప్యంగా ఉంచుతామన్నారు. మహిళల రక్షణ కోసమే షీ టీం ఏర్పాటయిందని, మహిళలు, విద్యార్థినులు ఈవ్ టీజింగ్‌లకు గురైతే షీ టీం వెంటనే స్పందిస్తుందన్నారు. విద్యార్థినులు షోషల్ మీడియాను తక్కువగా వాడాలన్నారు. అనంతరం ఈవ్‌టీజింగ్, చైల్డ్ లేబర్, హ్యూమన్ ట్రాఫికింగ్, డ్రగ్స్ వాడకం, వ్యభిచారం, ఇల్లీగల్ బాడీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, తదితర అంశాలపై అవగాహ న కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కొంతం నగేష్, షీ టీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా రవి

రాయికల్, మార్చి 28: రాయికల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా కూరగాయల రవి ఎన్నికయ్యారు. రాయికల్ పట్టణంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శిగా గరిపెల్లి శ్రీనివాస్, కోశాధికారిగా పల్లెర్ల పవన్, ఉపాధ్యక్షులుగా అయితె శేఖర్, సిర్ప సంతోష్, బొలుసాని ఆంజనేయులు, అయితె నవీన్, జాయింట్ సెక్రటరీగా సిద్ధంశెట్టి మహేష్, కూరగాయల అశోక్, రంజిత్, కటుకం కళ్యాణ్‌లు ఎన్నికకాగా, వీఆర్‌వోలుగా నాగమల్లి శ్రీకర్, నరంశెట్టి మనోజ్‌లను నియమించినట్లు అధ్యక్షుడు రవి తెలిపారు.

గడ్డం వంశీని సన్మానించిన నాయకులు

కోరుట్ల, మార్చి 28 : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గురువారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించి అభినందించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన గడ్డం వంశీకృష్ణను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో కలిసి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పశు సంరక్షణపై యజమానులు దృష్టి సారించాలి

కోరుట్ల రూరల్, మార్చి 28 : పశువుల సంరక్షణపై యజమానులు దృష్టి సారించాలని, గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని నియోజకవర్గ మానిటరింగ్ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ బక్కయ్య అన్నారు. గురువారం మండలంలోని చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావు పేట, సంగెం గ్రామంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అఫీసర్ కందుకూరి పూర్ణచందర్, యశ్వంత్‌లు గ్రామంలోని గేదెలు, ఆవులకు వ్యాధి నివారణ టీకాలను వేసి పశువుల సంరక్షనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధిగా నరేష్

ఇబ్రహీంపట్నం, మార్చి 28: ఇబ్రహీంపట్నం మండల బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధిగా డబ్బ గ్రామానికి చెందిన ముద్ద నరేష్‌ను నియామిస్తు గురువారం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు నల్ల వెంకటేష్ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం బీసీ సంఘం అధ్యక్షులు ఆవుల శ్రీకాంత్, రాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ధర్మపురి, మార్చి 28: ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సంఘ లావాదేవీలు, గోదాముల నిర్మాణం గురించి చర్చించారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా కమలాపూర్ గ్రామంలో చైర్మన్ తన స్వంతంగా సొసైటీ పేరట ఒక గుంట భూమి దానం చేశారు. రిజిష్టర్ పత్రాలను సంఘ సభ్యుల సమక్షంలో ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ షేర్ల రాజేశం, పాలకవర్గ సభ్యులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, బలిజపెల్లి లింగన్న, గుర్రాల పెద్దపోశం, కుమ్మరి రవి, నక్క రాజు, నూర లక్ష్మి, పెరుక రమేష్, జాజాల లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగుకు సేంద్రియ ఎరువులను వాడాలి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 28 : పంట సాగులో రైతుల ఎరు వులు వాడడం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని మెట్ పల్లి విశాల సహకర సంఘం చైర్మన్ తీగల లింగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో ఇఫ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువుల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మాజీ సర్పంచు గడ్డం లింగారెడ్డి, డాక్టర్ రవీందర్, వైద్య సిబ్బంది మురళి, రమ, చిరంజన్, దిలీప్, మోహన్, రైతులు పాల్గొన్నారు

నిరుపేద వివాహానికి ఆర్థిక సాయం

గొల్లపల్లి, మార్చి 28 : గొల్లపల్లి మండలం ఇస్రాజ్ పల్లె గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి ఆనాథగా మారిన పురాణం స్రవంతి అనే నిరుపేద యువతి వివాహ ఖర్చుల నిమిత్తం తాజా మాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, కొండ వెంకటేష్ గౌడ్ గురువారం చెరో రూ. 5116 ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా దాతలకు స్రవంతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద యువతికి తమ వంతు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచిన దాతలను పలువురు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, మార్చి 28 : మండల కేంద్రంలో నిర్మించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన మారు తిరుపతిరెడ్డి దంపతులు 55 వేల 116 రూపాయలను, ఆలయ పూజారి నాగరాజు రమేష్, ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దాపూర్ మల్లన్నస్వామి బోనాల జాతరకు ముస్తాబు

● బోనాలు సమర్పించనున్న సుమారు 70వేల మంది భక్తులు



పెద్దాపూర్‌లోని జాతరకు ముస్తాబైన మల్లన్న స్వామి ఆలయం

మెట్‌పల్లి రూరల్, మార్చి 28 : మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతరకు ఆలయం ముస్తాబైంది. గ్రామంలో సుమారు 100ఏళ్ల క్రితం వెలిసిన మల్లన్న స్వామి కోరిన కోరికలకు వరాలనిచ్చే పుణ్య క్షేత్రంగా పేరొందింది. ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో పాల్గొంటారు. జాతర కోసం గ్రామస్థులు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు వారం రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 30న ప్రారంభమై ఏప్రిల్ 2న ముగియనుంది. ఈ వేడుకలలో సుమారు 70వేల మంది భక్తులు బోనాలు సమర్పిస్తారు. అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా జాతర ఉత్సవాలు...

మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ఈనెల 30వ తేది నుంచి ప్రారంభమవుతాయి. శనివారం ఉదయం ఆలయంలోని ఉత్సవ మూర్తుల గంగా స్నానానికి నిర్వాహకులు ఇబ్రహీంపట్నం మండలంలోని ఏర్ధండి గంగకు తీసుకెళ్తారు. అక్కడ గంగా జలంతో స్వామి విగ్రహాలకు జలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరుపుతారు. అనంతరం తిరిగి ఉత్సవమూర్తులను గ్రామంలోని ఆలయంలో ఏర్పాటు చేస్తారు. అదే రోజు రాత్రి స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం నుంచి మల్లన్న స్వామి, శివలింగంకు భక్తులు దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. జాతరలో పాల్గొనడానికి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, కర్ణాటక, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి సుమారు 70వేల మంది భక్తులు పాల్గొనున్నారు. స్వామి వారికి భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనాలను భక్తులు నెత్తిన ఎత్తుకొని శివశక్తుల పోనకాలు, ఒగ్గుకళాకారుల నృత్యాలతో డప్పుచప్పుల్లతో ఆలయం చుట్టూ ప్రదక్షణాలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఈ జాతర ప్రత్యేకతలో ఒక్కటి. అనంతరం స్వామి వారిని ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేయించి బోనాల పండుగను ముగిస్తారు. మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అగ్నిగుండం, అర్చనలు, విశేష పూజలు, తదితర కార్యాక్రమాలను నిర్వహించి ముగియనుంది.

జాతర ఉత్సవానికి అన్ని సిద్ధం

నారాయణరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్



భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మల్లన్న స్వామి జాతర ఉత్సవాలకు అన్ని సిద్ధం చేశాము. మల్లన్న స్వామిని భక్తులు కోరిన కోరికలకు వరాల నిచ్చే పుణ్య క్షేత్రంగా పేరు గావించింది. ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను జరపడం అనవాయితీ. మూడు రోజులగా జరిగే జాతర ఉత్సవానికి వివిధ ప్రాంతాల నంచి ప్రతి ఏటా సుమారు 70వేల మంది భక్తులు పాల్గొంటారు. జాతర కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామస్థులు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యుల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నాము.